## క్లుప్తంగా

### నేడు ఉచిత వైద్యశిబిరం

**వేములవాడ:** బోయినపల్లి మండలకేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కరీంనగర్ ఫాగ్సీ, ఐఎంఏ సిరిసిల్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పద్మలత, శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నాడి రాధమ్మ ఫంక్షన్‌హాల్‌లో జరిగే ఈ క్యాంపులో ఫిజీషియన్స్, గైనకాలజిస్ట్‌లు, పిల్లల వైద్యులు, కంటి, దంత వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

**వీర్నపల్లి :** హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండలంలోని పీఎంసీ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చి విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా క్రీడల అధికారి రాందాస్ తెలిపారు. ఆర్.అక్షిత, జే.హృతిక,బి.శిల్వరాజ్ విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

**కోనరావుపేట:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన నలుగురు విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు మండలవిద్యాధికారి మురళీనాయక్ తెలిపారు. ఎంపికైన వారిలో ధర్మారం పాఠశాలకు చెందిన వెలిశాల మధు శరణ్య, ఎర్రం శ్రీహర్ష, నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి ఘనశ్రీ, నిమ్మపల్లికి చెందిన జనగామయ అనుప్రియ ఎంపికైనట్లు తెలిపారు. జూలై 1న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలో పాల్గొంటారన్నారు.

### నేడు హుండీ లెక్కింపు

**వేములవాడ:** వేములవాడ రాజన్న హుండీ లెక్కింపును మంగళవారం లెక్కించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయ అధికారులు హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఈవో రాధాభాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### డీఎంకు వినతిపత్రం అందజేత

**ముస్తాబాద్:** పోతుగల్ మీదుగా ముస్తాబాద్ వరకు ఆర్టీసీ బస్సు నడపాలని సిరిసిల్ల డీఎంకు వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ నాయకుడు కోల కృష్ణ తెలిపారు. గతంలో ఈ రూట్‌లో నడిచే బస్ సర్వీస్‌ను రద్దు చేశారన్నారు. దీంతో సేవాలాల్‌తండా, గన్నేవారిపల్లె, పోతుగల్ గ్రామాలకు చెందిన విద్యార్థులు, కూలీలు, మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థుల కోసం పోతుగల్ బస్సును నామాపూర్ మోడల్ స్కూల్ వరకు నడపాలని కోరారు.

### విద్యార్థినికి ఆర్థిక సాయం

**సిరిసిల్లకల్చరల్:** ప్రతిభావంతురాలై ఉన్నత విద్య చదవలేని పేద విద్యార్థికి రూ.40వేలు ఆర్థికసాయంగా అందజేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదివిన కొండి వర్షిత ఇంటర్‌లో 976 మార్కులు సాధించింది. ఎప్‌సెట్‌లో 53 వేల ర్యాంకు సాధించింది. గతంలో పదో తరగతిలో సైతం 9.7 జీపీఏ సాధించింది. ఉన్నత చదవాలంటే ఆర్థికస్తోమత లేదు. ఆర్థికంగా చేయూత అందించాలని సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టగా వివేకవర్ధిని హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పలువురు ఉదాతర చాటారు. గడ్డం భానుచందర్, రామకృష్ణ, హారిక, శ్రీనివాస్, గుడ్ల వినయ్, వేణు పోగు చేసిన రూ.40వేలను సోమవారం వర్షిత ఇంట్లో అందజేశారు.

### జర్నలిస్టుల ర్యాలీ



**వేములవాడ:** మహాటీవీపై కొందరు దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ వేములవాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సోమవారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రెస్‌క్లబ్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. మీడియాను భయపెట్టి, దాడులు చేస్తే సహించలేమని హెచ్చరించారు. భవిష్యత్‌లో మీడియాపై దాడులు జరగకుండా కేంద్ర, ప్రభుత్వాలు చట్టాలు అమలుచేయాలన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యదర్శి మహేశ్, సీనియర్ పాత్రికేయులు శంకర్, జనార్దన్, బాబు యాదవ్, రఘు, సంపత్, శ్రీనివాస్, ప్రణవ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

### మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

**గంభీరావుపేట:** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వారు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై రమాకాంత్ అన్నారు.గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మైనర్ నడిపిన బైక్‌లకు జరిమానా విధించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

**పాముకాటుకు గురైన రైతు**

**ఇల్లంతకుంట:** మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అంతగిరి శ్రీనివాస్‌ను సోమవారం పాము కాటు వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు



అసంపూర్తిగా హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రం



అనంతారం పాఠశాలలో మధ్యలోనే నిలిపివేసిన తరగతి గది నిర్మాణ పనులు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనం
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు

**ఇల్లంతకుంట:** మండలంలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల తరగతి గదులు అసంపూర్తిగా నిర్మించడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో గాలిపెల్లి, వంతడుపుల, రేపాక, ఇల్లంతకుంట, ముస్కానిపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తి చేయడం లేదని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎర్ర నర్సుపల్లెలో అంగన్‌వాడీ భవనాన్ని 2014లో పదో ఆర్థికసంఘం నిధులతో నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. నిధులు సరిపోక కిటికీలు, తదితర పనులు చేపట్టకపోవడంతో పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. గాలిపెల్లి, ముస్కానిపేట, వంతడుపుల, రేపాక, ఎర్రనర్సుపల్లి, అంగన్‌వాడీ కేంద్రాలు ఆయా గ్రామ ప్రాథమిక పాఠశాలలో సర్దుబాటు కాగా ఇల్లంతకుంటలోని హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అసంపూర్తి భవనాలపై సంబంధిత జిల్లా అధికారులను సంప్రదించగా పంచాయతీరాజ్ శాఖ కు నిధులు విడుదల చేశామని తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే అనంతారం ప్రాథమిక పాఠశాలకు మూడేళ్ల క్రితం మన ఊరు మనబడి కింద రూ.18లక్షలతో పాఠశాల భవనం, పంపుహౌస్, తదితర ప నులకు నిధులు కేటాయించారు. భవనా న్ని స్లాబ్‌వరకు నిర్మిస్తే బేస్‌మెంట్ వరకే బిల్లు వచ్చిందని కాంట్రాక్టర్ మల్లేశం తెలిపారు. మళ్లీ నిధులు మంజూరుకాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలిపాడు.

### త్వరలో పూర్తిచేస్తాం



మండలంలో రేపాక, గాలిపెల్లిలోని అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేసేందుకు టెండర్లు పూర్తయ్యాయి. ఎర్రనర్సుపల్లెలో మిగిలిన పనులు త్వరలో పూర్తిచేస్తాం. వంతడుపుల, ముస్కాన్‌పేట, ఇల్లంతకుంట హరిజనవాడ, అంగన్‌వాడీ కేంద్రాలకు టెండర్ వేయలేదు. అసంపూర్తి భవనాల నిర్మాణాలను త్వరలో పూర్తయ్యేలా చూస్తాం.

– పీఆర్ ఏఈఈ రాజేశ్, ఇల్లంతకుంట

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



అసంపూర్తిగా నిర్మించిన అనంతారం పాఠశాల భవన నిర్మాణంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. పాఠశాలలో రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇది పూర్తయితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

– చెప్యాల శ్రీనివాస్ గౌడ్, ఎంఈవో

# కుల వివక్షను వీడి ఐక్యంగా ఉండాలి



ఎల్లారెడ్డిపేట : రాజన్నపేటలో పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు



చందుర్తి : మాట్లాడుతున్న అధికారులు

**ఎల్లారెడ్డిపేట:** గ్రామాల్లోని ప్రజలు కుల వివక్షను వీడి ఐక్యంగా ఉండాలని జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ కమిటీ అధ్యక్షుడు అజ్మీరా తిరుపతినాయక్ అన్నారు. మండలంలోని రాజన్నపేటలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుపతినాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్క శంకర్, మాజీ ఎంపీటీసీ నమిలికొండ శ్రీనివాస్, ఆర్ఐ శ్రావణ్, హెడ్ కానిస్టేబుల్ సబీర్, పంచాయతీ కార్యదర్శి రవి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వేములవాడరూరల్:** వేములవాడ మండలంలోని నాగాయపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎవరైనా కుల వివక్ష చూపితే ఎస్సీ, ఎస్టీ యాక్టు ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, ఆర్ఐ బాలు, సెక్రెటరీ జీవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** గ్రామంలోని ప్రజలు ఐక్యంగా ఉండాలని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. మర్తనపేటలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో అంటరానితనం లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ, ఆర్ఐ సంతోష్, ఏపీవో శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**చందుర్తి :** ఎస్సీ, ఎస్టీలను కించపరిచే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపైన చర్యలు తీసకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) మహేందర్ అన్నారు. కిష్టంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. గ్రామాల్లో వివక్ష లేకుడా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజు, హెడ్‌కానిస్టేబుల్ రంగస్వామి, నాయకులు నరేశ్, మోకనపల్లి దేవరాజు, కొమటిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు



కుమారస్వామి దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

**సిరిసిల్ల:** ప్రతీఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అన్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యకు డు, జమేదార్ రొద్ద కుమారస్వామి సోమవారం ఉద్యోగ విరమణ సందర్భంగా కలెక్టర్ మెమొంటోతో సత్కరించారు. కలెక్టరేట్ ఏఓ రాంరెడ్డి, డీఆర్డీవో శేషాద్రి, ఆయాశాఖల ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

### విద్యార్థులకు దుస్తులు అందజేత

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.మోహన్‌రావు తన ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో చదివే 110మంది విద్యార్థులకు రూ. 50వేల విలువైన దుస్తులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్
- నలుగురిపై పీడీయాక్ట్



**వేములవాడ:** గంజాయితో పాటు వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నలుగురిపై పీడీయాక్ట్ నమోదు చేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ సోమవారం తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్ గతంలో గంజాయి, హత్యాయత్నం, హత్యకేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వారి ప్రవర్తనలో మార్పురాకపోవడం, తరచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో నలుగురిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని రౌడీ షీట ర్లు, నేరస్తులపై నిత్యం పోలీస్ నిఘా ఉంటుందన్నారు.

**• ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి**

**సిరిసిల్లటౌన్:** ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కోఆర్డినేటర్ వెంగళ శ్రీనివాస్ కోరారు. ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ ఎదుట శాంతియుతదీక్ష చేపట్టారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస పథకంలో 20 శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని కోరారు. ఫోరం ప్రతినిధులు వెంగళ లక్ష్మణ్, కందుకూరి బాలాగౌడ్, మామిడాల రమణ, కొండ శంకర్, కర్నె లక్ష్మి, సబ్బని శాంత పాల్గొన్నారు.

**• జిల్లా అంతటా 'ముసురు'కున్న వర్షం**

**సిరిసిల్ల:** జిల్లాలో వర్షం ముసురుకుంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు జిల్లా అంతటా వర్షం పడింది. వేములవాడలో 29.9 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 23.8, చందుర్తిలో 17.0, వేములవాడ రూరల్‌లో 18.5, బోయినపల్లిలో 15.4, సిరిసిల్లలో 23.5, కోనరావుపేటలో 23.9, వీర్నపల్లిలో 18.2, ఎల్లారెడ్డిపేటలో 22.1, గంభీరావుపేటలో 18.7, ముస్తాబాద్‌లో 19.2, తంగళ్లపల్లిలో 21.0, ఇల్లంతకుంటలో 20.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి సగటు వర్షపాతం 20.9 మిల్లీ మీటర్లు కురిసింది.

**• ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి**

**వేములవాడఅర్బన్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ క్లబ్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. అధ్యాపకులు కరుణ, శ్రీధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**• విద్యార్థులకు నగదు పారితోషికం**

**సిరిసిల్లకల్చరల్ :** పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులను అభినందించారు. పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష రాసిన సిరిసిల్ల ప్రసన్న 561, రాపెల్లి జలందర్ 535 ఉత్తమ మార్కులు సాధించారు. 1962 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన చిట్నేని శ్రీనివాసరావు, మడుపు ముత్యంరెడ్డి చేతుల మీదుగా రూ.8వేలు అందజేశారు.

**• విరిగిపడ్డ చెట్టు.. తప్పిన ప్రమాదం**

**సిరిసిల్ల:** పట్టణంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని నేతన్న చౌక్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చెట్టు రోడ్డుపై విరిగిపడగా ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఓ తోపుడు బండిపై చెట్టుపడడంతో అది ధ్వంసమైంది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పట్టణ సీఐ కృష్ణ ఆదేశాల మేరకు ఎస్సైలు శ్రీకాంత్, వినీతారెడ్డి, సిబ్బంది చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

**• 9వ ప్యాకేజీ బాధిత రైతులకు పట్టాలు ఇవ్వాలి**

**సిరిసిల్లఅర్బన్:** 9వ ప్యాకేజీలో పట్టాలు కోల్పోయిన రైతులకు తిరిగి పట్టాలను ఆన్‌లైన్‌లో చేయాలని కోరుతూ వీర్నపల్లి మండల రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 9వ ప్యాకేజీ పైపులైన్‌లో నష్టపోయిన భూ మితోపాటు రైతులకు ఉన్న మొత్తం పట్టాలు గల్లంతయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు ప ట్టాలు ఇవ్వాలని కోరారు. రైతులు పిట్ల నాగరాజు, రాజేశం, దేవయ్య, నర్సయ్య, శంకర్, రాజం, లింబయ్య, అనిల్ పాల్గొన్నారు.

### ఇంటిని తగలబెట్టిన కేసులో ఐదేళ్ల జైలు

**తంగళ్లపల్లి:** అన్న ఇంటిని తగలబెట్టిన తమ్ముడికి ఐదేళ్ల జైలుతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సోమవారం తీర్పు వెల్లడించినట్లు రూరల్ సీఐ మొగిలి తెలిపారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన నర్సయ్య, మల్లయ్య అనే అన్నదమ్ములకు భూవివాదాలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో తమ్ముడు మల్లయ్య, అన్న నర్సయ్య ఇంటిని జూన్ 12, 2019న రాత్రి తగలబెట్టాడు. నర్సయ్య మల్లయ్యపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శేఖర్ కేసునమోదు చేశాడు. సాక్ష్యాలు పరిశీలించిన జడ్జి ఐదేళ్ల జైలు, జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

### నకిలీ బిల్లులతో మోసం

- ప్రభుత్వ ఉద్యోగికి మూడేళ్ల జైలు

**సిరిసిల్లకల్చరల్:** నకిలీ జీతాల బిల్లులను తయారు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన ఉద్యోగికి మూడేళ్ల జైలు విధిస్తూ ప్రథమశ్రేణి న్యాయమూర్తి సోమవారం తీర్పు వెల్లడించారు.టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గంభీరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బానోత్ నరేశ్ సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహించేవాడు. 2015 జనవరి నుంచి నవంబర్ వరకు స్టాఫ్‌నర్స్ మంజులత, అరుణ పేర్లతో నెలవారీ జీతాల బిల్లులు, సెలవులకు సంబంధించిన వేతనాల బిల్లులు తయారు చేసి ట్రెజరీకి సమర్పించాడు. మొత్తం రూ.12లక్షలు డ్రా చేశాడు. జీతం మినహాయింపు రూ.1,06,194లు పోను మిగిలిన సొమ్ము సొంత సేవింగ్స్ ఖాతాకు మళ్లించి తన అవసరాలకు వాడుకున్నాడు. ఉమ్మడి కరీంనగర్ ట్రెజరీ ఉప సంచాలకుల విచారణలో మంజులత, అరుణ గంభీరావుపేట పీహెచ్‌సీలో విధి నిర్వహణలో లేరని తేలింది. మరో చోట నుంచి వారి జీతాల చెల్లింపులు జరిగాయి. అకౌంటెంట్ జనరల్ శాఖ అధికారులు విచారణ ప్రారంభించడంతో నరేశ్ మోసం వెలుగులోకి వచ్చింది. డ్రాయింగ్, డిస్బర్స్ డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ రమేశ్ సంతకాలతో కూడిన బిల్లులను సిరిసిల్ల సబ్ ట్రెజరీ సిబ్బంది గుర్తించకుండా బిల్లులు మంజూరు చేశారు. కరీంనగర్ డీటీవో కందగట్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి సీఐ విజయ్‌కుమార్ నరేశ్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ చెలుమల సందీప్ కేసు వాదించారు. ఆరుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువైన కారణంగా నరేశ్‌కు మూడేళ్ల జైలుతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

# అంతర్‌జిల్లా దొంగల ముఠా రిమాండ్

- 12 తులాల బంగారం, బైక్ స్వాధీనం
- అభినందించిన ఎస్పీ మహేశ్ బీ గీతే



దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు

**వేములవాడ:** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పోలీసులు సోమవారం తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేశ్ బీ గీతే వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లాకు చెందిన బోదాసు మహేశ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన గద్దల స్వప్న, విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లాకు చెందిన నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల రాణి, గోత్రాల బాలమణి ముఠాగా ఏర్పడి ఆర్మూర్, నిజామాబాద్, వేములవాడ, కోనరావుపేట, బోయినపల్లి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. గత మే 2వ తేదీ రాత్రి వేములవాడలోని సాయినగర్‌లో దొంగతనానికి పాల్పడ్డారు. అదే కాలనీలో గత మే 25న, భగవంతరావునగర్‌లో జూన్ 12న, మే 11న ఆర్మూర్‌లోని అరుంధతినగర్, మే 16న ఆర్మూర్ పక్కన గల పిరికిట్ వినాయకనగర్, మే 25న పిరికిట్ వినాయకనగర్, జూన్ 2న ఆర్మూర్‌లోని మెడికల్ షాప్, జూన్ 7న ఆర్మూర్‌లోని యోగేశ్వరకాలనీ, జూన్ 16న ఆర్మూర్ పక్కన గల పిరికిట్ ఆర్టీసీకాలనీలో దొంగతనాలకు పాల్పడ్డారు. టెక్నాలజీ సహాయంతో వీరు వేములవాడ సమీపంలో తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 తులాల బంగారం, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సైలు అనిల్‌కుమార్, వెంకట్రాజం, సిబ్బంది గోపాల్, పంతులు, లత, సాహెబ్ హుస్సేన్, దేవేందర్, సమియుద్దీన్‌లను అభినందించారు.

### జర్నలిస్టుల పిల్లలకు వందశాతం రాయితీ ఇవ్వాలి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న జర్నలిస్టులు

**సిరిసిల్ల అర్బన్ :** జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో వందశాతం ఫీజు రాయితీని కల్పించాలని రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రం అందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పేద, మధ్యతరగతి వారే ఎక్కువ మంది జర్నలిస్టులు ఉన్నారని వారి పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. ఇక్కడ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

### 'బీఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించం'



మాట్లాడుతున్న సురేందర్‌రావు

**ముస్తాబాద్:** ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ కుట్ర పూరితంగా ఆంధ్రా మీడియాతో బీఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండల శాఖ అధ్యక్షుడు బోంపెల్లి సురేందర్‌రావు హెచ్చరించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టి మరల్చేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్, పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, భరత్, తాళ్లరాజు, పూస బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ పాఠశాల గుర్తింపు రద్దుచేయాలి

**సిరిసిల్లటౌన్:** అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ పాఠశాల ముందు ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ. లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు నోటీస్ అందించినా పాఠశాల యాజమాన్యం బుక్స్, యూనిఫా మ్స్ అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. విద్యాహక్కు చట్టంప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ వికలాంగులు పేద విద్యార్థులకు 25% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించాలన్నారు. ఈ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల అధిత్య, నాయకులు పున్ని పవన్, జామచెట్టి ఈశ్వర్, రగూడ ప్రణయ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

### క్షుద్రపూజలు చేయిస్తున్నారని ఫిర్యాదు

- కేసు నమోదు చేసిన పోలీసులు

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రాగుల హరిచరణ్‌కు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రాజ్‌ఖాన్‌పేటకు చెందిన తాళ్లపల్లి అశ్వితతో 2022లో వివాహమైంది. కట్నంగా కొంతభూమి, 11 తులాల బంగారం అప్పజెప్పారు. అల్లుడికి ఇచ్చిన భూమిలో తిరకాసు ఉండడంతో ఆ కుటుంబ సభ్యులకు సమస్యలు ఎదురయ్యాయి. దీంతో బిడ్డ అశ్రితను అల్లుడు హరిచరణ్‌తో విడాకులు తీసుకోవాల్సిందిగా సూచించారు. అశ్రిత ఒప్పుకోకపోవడంతో ఓ క్షుద్రపూజారిని కలిసి కొంత డబ్బులిచ్చి హరిచరణ్ కాళ్లు పనిచేయకుండా పూజలు చేయాలంటూ మాట్లాడిన ఫోన్ సంభాషణలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో భార్యాభర్తలు హరిచరణ్, అశ్రితలు పోలీసులను ఆశ్రయించారు. అశ్రిత ఫిర్యాదుతో అధికం శంకర్‌గౌడ్, సత్తయ్యగౌడ్, మద్దికుంట బాలాగౌడ్, మద్దిగుంట స్వరూప, మద్దికుంట శ్రీధర్ గౌడ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు.

### రోడ్డు భద్రత సామాజిక బాధ్యత



గొల్లపల్లిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

**ఎల్లారెడ్డిపేట:** రోడ్డు భద్రత నియమాలను సామాజిక బాధ్యతగా పాటించాలని ఎస్సై ఎస్సై రాహుల్ రెడ్డి సూచించారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 15 మందికి జరిమానా విధించారు.

### నూతన కార్యవర్గం

**గంభీరావుపేట:** మండలకేంద్రంలోని శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగు లింగం యాదవ్, ఉపాధ్యక్షుడిగా కోట లింగం, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రాజమల్లయ్య, కోశాధికారిగా గుడికాడి కొమురయ్య, సలహాదారులుగా పెద్దవేని రాజమల్లయ్య, జీడీ పెంటయ్య, తెల్జీరి కిషన్ ఎన్నికయ్యారు.

### సన్మానం



హెచ్‌ఎం లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**ముస్తాబాద్:** మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్ ఉద్యోగ విరమణ పొందగా ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ భవన్‌లో లక్ష్మణ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్, రామాలయ కమిటీ చైర్మన్ సతీశ్ చందర్, ఎస్ఎంసీ చైర్మన్ ప్యారం అనిత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాముల స్వామి, వీడీసీ చైర్మన్ నక్కదాసరి రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ మోడల్ హౌస్ పరిశీలన

**వేములవాడ:** మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను హౌసింగ్ డీఈ కాజా ముజాఫరుద్దీన్ సోమవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మోడల్ హౌస్ నమూనాతో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం, హౌసింగ్ ఏఈలు, తదితరులున్నారు.